క్లుప్తంగా


పామర్రులో శుక్రవారం జరిగిన విద్యాదీవెన సభకు హాజరైన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్.

ఆర్డీవో రవీంద్రరావు బాధ్యతల స్వీకారం



నందిగామ: నందిగామ ఆర్డీవోగా ఎ.రవీంద్ర రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.సాయిబాబు రాజమండ్రికి బదిలీకాగా, ఆస్థానంలో రవీంద్ర రావు బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో రవీంద్రరావును రెవెనూశాఖతోపాటు ఆయాశాఖల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.విధి నిర్వహణలో అలసత్వం వహించద్దని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

వీరులపాడు: ఎన్నికల నిబంధనల మేరకు సిబ్బంది విధులు నిర్వహించాలని తహసీల్దార్ రాజకిషోర్ ఆదేశించారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం, కొణతాలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవాకం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రాజకిషోర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. ఎన్నికల నిబంధనలకనుగుణంగా విధులు నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాపారిపై కేసు నమోదు

నందిగామ: పట్టణానికి చెందిన ఓవ్యాపారి ప్రముఖ బీడీ కంపెనీ పేరుతో నకిలీ బీడీలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు అందడంతో నందిగామ పోలీసులు సదరు వ్యాపారిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..పట్టణానికి చెందిన చిరంజీవి అనే వ్యాపారి ఎస్ బీడీ పేరుతో నకిలీ బీడీలను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు.
విషయం తెలుసుకున్న సదరు కంపెనీ యజమానులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ హనీష్ తెలిపారు.

రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయం

విజయవాడ కల్చరల్: సినీ నిర్మాత, దర్శకుడు ఒమ్మి రమాశంకర్ సామాజిక సేవలు అభినందనీయమని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్మాత దర్శకుడు ఒమ్మి రమాశంకర్, కళాపోషకుడు జిలానీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ రమాశంకర్ దర్శకునిగా యువ నటులు కొందరిని తెలుగు తెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. విశ్రాంత ఐఏసీ అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ రమాశంకర్ నగరానికి వచ్చిన అనతికాలంలోనే గాయనీ గాయకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ తన మురగా చారిటబుల్ సంస్థ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సహాయం చేశారని, నిర్మాత, దర్శకత్వం వహించిన అరణ్య సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సంస్మరణ సభలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మారేపల్లి జోషి, కారుమంచి రాజు, శ్యాంప్రసాద్, దామోదర గణపతిరావు, సింగంపల్లి రమణ, కొప్పుల ఆనంద్ తదితరులు రమాశంకర్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు కళాకారులు, వివిధ సంస్థల ప్రతినిధులు రమాశంకర్ చిత్రపటానికి నివాళి సమర్పించారు.

మెరైన్ ఇంజినీరింగ్‌తో ఉద్యోగావకాశాలు



తిరువూరు: నావికాదళంలో ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సింగపూర్ నావికాదళ ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ కెప్టెన్ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సర విద్యార్థులకు మెరైన్ ఇంజినీరింగ్, మర్చంట్ నావీ ఉద్యోగాలపై నైపుణ్య శిక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మెరైన్ ఇంజినీర్‌గా ఉపాధి అవకాశాలు, ఉద్యోగ బాధ్యతలను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, టీపీవో ఎంహెచ్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేట రోడ్లకు మహర్దశ

- రూ.54.57కోట్లతో నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి
- మెరుగుపడిన ప్రజారవాణా
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెనుగంచిప్రోలు : దశాబ్దాలు తరబడి జగ్గయ్యపేట నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను హయాంలో మోక్షం లభించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం సామినేని ఉదయభాను నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధంతో నియోజకవర్గ రోడ్ల నిర్మాణానికి ఈ నాలుగేళ్ల పదినెలల కాలంలో సుమారు రూ.55కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని ఆయా రోడ్ల విస్తరణ, మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏళ్లతరబడి ప్రజల ఇబ్బందులు తొలగాయి. ప్రజారవాణా వ్యవస్థ మెరుగుపడటంతోపాటు పంటల రవాణాకు ఉపయుక్తంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.14కోట్లతో చిల్లకల్లు–పేట రోడ్డు..
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఎంతో కాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి. ముఖ్యంగా జాతీయ రహదారి పక్కన చిల్లకల్లు నుంచి జగ్గయ్యపేట పట్టణం వరకు రూ.14కోట్లతో రహదారి నిర్మాణంతోపాటు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రూ.2.50కోట్లతో గండ్రాయి–షేర్‌మహ్మద్‌పేటతోపాటు తెలంగాణా సరిహద్దు గ్రామాలకు రోడ్డు నిర్మాణాలు చేపట్టడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు మరింత సులభతరమయ్యాయని ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పేట నియోజకవర్గంలో చేపట్టిన ఆయా రోడ్ల నిర్మాణ పనుల వివరాలు...


రూ.14 కోట్లతో నిర్మించిన చిల్లకల్లు–జగ్గయ్యపేట రహదారి


రూ.6కోట్లతో మరమ్మతులు నిర్వహించిన జగ్గయ్యపేట–వైరా రహదారి


రూ.1.50కోట్లతో నిర్మించిన పెనుగంచిప్రోలు–వేమవరం రోడ్డు

- రూ.6.20కోట్లతో జగ్గయ్యపేట నుంచి వైరా వరకు 13.6కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- 7.4 కిలోమీటర్ల జగ్గయ్యపేట–ముక్త్యాల రోడ్డును రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేశారు.
- జాతీయ రహదారి నుంచి మక్కపేట వయా దేచుపాలెం వరకు 6.4కిలోమీటర్ల రోడ్డును రూ.1.50 కోట్లతో పూర్తిచేశారు.
- రూ.4.50కోట్లతో జాతీయ రహదారి నుంచి వేదాద్రి వరకు 19కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేశారు.
- రూ.1.50కోట్లతో అనాసాగరం–పెనుగంచిప్రోలు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.
- రూ.85లక్షలతో జగ్గయ్యపేట–షేర్‌మహ్మద్‌పేట వరకు 1.9కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు.
- రూ.39లక్షలతో జగ్గయ్యపేట–వైరా రహదారిలో వత్సవాయి వద్ద కల్వర్టు నిర్మాణం
- రూ.75లక్షలతో జగ్గయ్యపేట–ముక్త్యాల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.
- రూ.15లక్షలతో అనిగండ్లపాడు–గుమ్మడిదూర్రు రోడ్డు అభివృద్ధి
- రూ.30లక్షలతో శివాపురం–అనిగండ్లపాడు రోడ్డుకు మరమ్మతులు
- రూ.30లక్షలతో వత్సవాయి–వేమవరం రోడ్డు పనులు చేపట్టారు.
- రూ.1.50కోట్లతో సుబ్బాయిగూడెం–కొళ్లికూళ్ల రోడ్డు అభివృద్ధి పనులు పూర్తిచేశారు.
- రూ.కోటితో శివాపురం–అనిగండ్లపాడు రోడ్డు పనులు ప్రారంభించారు.
- రూ.1.50కోట్లతో చేపట్టిన వత్సవాయి–వేమవరం రోడ్డు నిర్మాణం పూర్తయింది.
- రూ.1.20కోట్లతో గట్టుమూల నుంచి అనిగండ్లపాడు వయా గుమ్మడిదూర్రు వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- రూ.60లక్షలతో జగ్గయ్యపేట– బైపాస్ వరకు రోడ్డు పనులు ప్రారంభించారు.
- వత్సవాయిలో రూ.1.99కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు సాగుతున్నాయి.
- చెవిటికల్లు–వత్సవాయి రోడ్డుకు రూ.12.64 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.


రూ.కోటితో నిర్మించిన ముచ్చింతాల–తాళ్లూరు రహదారి

వేగంగా రోడ్ల నిర్మాణం



నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేశాం. శివాపురం–అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు–అనిగండ్లపాడు, వత్సవాయి గ్రామాలతోపాటు జగ్గయ్యపేట మండలంలో కూడా పలురోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. అవసరమైన చోట మరమ్మతు పనులు చేస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం.

– పి పరుశరాం,
ఆర్అండ్‌బీ డీఈ, జగ్గయ్యపేట

రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. పేట నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా నూతన రహదారుల నిర్మాణం చేపట్టాం. చిల్లకల్లు నుంచి జగ్గయ్యపేట పట్టణం వరకు రూ.14 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి. సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేశాం. అలాగే గ్రామాల్లో ఎప్పటినుంచో మరమ్మతులకు నోచుకోని రోడ్లను అందంగా తీర్చిదిద్దటం జరిగింది.

–సామినేని ఉదయభాను,
ప్రభుత్వవిప్

శరవేగంగా ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్లు



కంచికచర్ల : నవరత్నాలు పథకం కింద పేదలకు పంపిణీ చేసిన జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కంచికచర్ల మండలంలోని ఆయా గ్రామసచివాలయాల్లో శరవేగంగా సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవరత్నాలు పథకం కింద పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేసింది. ఆయా ఇళ్లస్థలాలపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు లభించేలా సీఎం జగనన్న ప్రభుత్వం ఆస్థలాల రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ చార్జిలను సైతం పూర్తిగా రద్దుచేసి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తోంది. మండలంలోని గ్రామసచివాలయాల్లో 3,615 మంది లబ్ధిదారుల ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,652 ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 963ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్‌ను కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు.

వైఎస్సార్ బీమా కింద రూ.2లక్షలు అందజేత

నవాబుపేట(పెనుగంచిప్రోలు): వైఎస్సార్ ఉచిత బీమా ద్వారా రాష్ట్రప్రభుత్వం పేదల కుటుంబాలకు అండగా ఉంటోందని వైఎస్సార్‌సీపీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు గింజుపల్లి శ్రీనివాసరావు అన్నారు. గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు మృతిచెందగా ఆయన భార్య పకీరమ్మకు వైఎస్సార్ ఉచిత బీమా కింద మంజూరైన రూ.లక్షను శుక్రవారం ఆయన అందజేశారు. గుంజి శివ మృతి చెందడంతో అతని కుటుంబసభ్యులకు మంజూరైన ఆర్థికసాయం రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గింజుపల్లి మధు, బి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

వీరులపాడు: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ కోటేరు లక్ష్మి కొనియాడారు. మండలంలోని పెద్దాపురం సచివాలయంలో శుక్రవారం ఆమె 202 మంది జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ పెద్దాపురంలో 202మంది లబ్ధిదారుల ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇళ్లస్థలాలు ఇవ్వడంతోపాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జయంతిలో..
మండలంలోని జయంతి గ్రామంలో 101మంది ఇళ్లస్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాను శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచి మారపాక మహాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. పేదల ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా సరికొత్త చరిత్రకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని కొనియాడారు.


పెద్దాపురంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆపాత మధురాలు సంగీత కార్యక్రమం సినీ క్లాసికల్ విశిష్టతను చాటింది. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం లాంటి సంగీత కళాకారులు అరుదుగా కనిపిస్తారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాస్టారని, బాలసుబ్రహ్మణ్యం వివిధ భారతీయ భాషలలో 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నందిగామ: ఇంటర్ ఫస్ట్‌ఇయర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులకు ఫస్ట్ లాంగ్వేజ్‌కు సంబంధించి తెలుగు, సంస్కృతం పరీక్షను నిర్వహించారు. నందిగామలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 2,261మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 2,159మంది విద్యార్థులు హాజరయ్యారు.102మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీరు, ఇతర మౌలికవసతులు కల్పించారు. ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కంచికచర్ల మండలంలో..
కంచికచర్ల: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కంచికచర్ల మండల పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షలకు 938మంది హాజరుకావాల్సి ఉండగా, 882మంది హాజరైనట్లు కస్టోడియన్ అధికారి వాసుదేవరావు తెలిపారు. కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 150మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరెండెంట్ జయప్రకాష్ తెలిపారు. స్థానిక ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో 162మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 157మంది, దీక్షా డిగ్రీ కళాశాలలో 250మందికిగాను 241మంది, కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 346మందికిగాను 334మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయా కళాశాల పరీక్షల సూపరిండెంటెంట్లు పద్మజ, రత్నకుమారి, తిరుపతిరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యల నడుమ విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాశారు.


కీసర పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు శానిటైజర్ అందిస్తున్న ఆరోగ్యసిబ్బంది


పేటలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


నందిగామలో పరీక్షా కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు

పేటలో 1305మంది హాజరు..
జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీయట్ పరీక్షలు పట్టణంలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎస్‌జీఎస్, వాగ్దేవి, జేఆర్సీ, అమ్మాణీ కళాశాలలోఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1401మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 1305 మంది హాజరయ్యారు. 96మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.
ఎస్‌జీఎస్ కళాశాల పరీక్షల చీఫ్ సూపరిండెంటెంట్(సీఎస్)గా పి.రవి, డీవోగా హనుమంతరావు, వాగ్దేవి మహిళా కళాశాల సీఎస్‌గా స్వర్ణవాణి, డీవోగా ఆర్.శ్రీనివాసరావు, జేఆర్సీ కళాశాలకు సీఎస్‌గా వి.సురేష్, డీవోగా శివయ్య, అమ్మాణీ కళాశాల సీఎస్‌గా జి.శకుంతల, డీవోగా కరుణాకరరెడ్డి వ్యవహరిస్తున్నారని ఇంటర్ పరీక్షల కస్టోడియన్ శౌరిలమ్మ తెలిపారు.

●అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సందడి






జగ్గయ్యపేట మున్సిపాలిటీ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రెండేళ్లలో రూ.27.27కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శుక్రవారం ప్రారంభించారు. తొలుత విప్ ఉదయభాను విలియంపేటలోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి ఆయావార్డుల్లో చేపట్టిన మంచినీటి పైపులైన్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, సీసీరోడ్ల నిర్మాణాలను ఆయావార్డుల కౌన్సిలర్లు, ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రారంభించారు. చిల్లకల్లు-జగ్గయ్యపేట మధ్య రూ.కోటితో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలోని అన్నివార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఒకేరోజున ప్రారంభోత్సవం చేయడంతో పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. పట్టణమంతటా ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కార్యక్రమాలు చేపట్టడంతో ప్రతివార్డులో సందడి నెలకొంది. తీన్‌మార్ వాయిద్యాలు, డీజేలతో సందడి చేస్తూ వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన ట్రాక్టర్లు, బైక్ ర్యాలీలతో జగ్గయ్యపేట పట్టణం దద్దరిల్లింది. ఎన్నికల వాతావరణాన్ని తలపించింది.

– జగ్గయ్యపేట అర్బన్

నిరంతర సాధనే విజయానికి సోపానం

విజయవాడ కల్చరల్: నిరంతర సాధనే విజయానికి సోపానమని రాగలహరి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు బి.మీరాకుమార్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద మృదుమధుర సంగీతం –సినీ సంగీత వైభవం పేరుతో మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మీరాకుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు పంచ సూత్రాలను పాటించాలని, చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, సాధన, సంగీత సాహిత్యాల పట్ల మమకారం ఉండాలన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పరుచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి సంస్థ చేస్తున్న సంగీత సేవలను వివరించారు. గాయని మల్లాది స్వాతి ఆధ్వర్యంలో అయ్యప్పన్, వడ్డాది సూర్య కామేశ్వరి, నాయక్, షబానా, రూపశ్రీ, తెలుగు, హిందీ, భక్తిగీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

- 8న శివపార్వతుల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మ పరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.